క్లుప్తంగా

పెన్‌కాక్ సిలాట్ విజేతకు అభినందనలు



సాయికిరణ్‌ను అభినందిస్తున్న వాకర్స్ అసోసియేషన్ నిర్వాహకులు

ఆత్మకూరు: ఇటీవల కేరళలో జరిగిన జాతీయ స్థాయి పెన్‌కాక్ సిలాట్ (మార్షల్ ఆర్ట్స్)లో బంగారు పతకం సాధించిన ఆత్మకూరు విద్యార్థి పి సాయికిరణ్‌ను వాకర్స్ అసోసియేషన్ అభినందించింది. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సాయికిరణ్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం



మస్తాన్ భార్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలకు చెందిన పూర్వ విద్యార్థి పంచేటి మస్తాన్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో సోమశిల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99 బ్యాచ్ విద్యార్థులు మస్తాన్ కుటుంబానికి రూ.31 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన పూర్వ విద్యార్థులకు పంచేటి మస్తాన్ భార్య కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 18 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న జ్ఞాపకాలను ఈ పాఠశాలతో పంచుకునే అవకాశం లభించిందని, ప్రతి ఒక్కరూ తమ పూర్వ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపినట్లు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు.

ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం



డాక్టర్ ప్రసాద్‌కు జాతీయ పురస్కారం అందజేసి సన్మానిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.ప్రసాద్ ఆదివారం డాక్టర్ బోయిభీమన్న స్మారక జాతీయ పురస్కారం అందుకున్నారు. తిరుపతికి చెందిన ఉషోదయ ఫౌండేషన్ సంస్థ వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి బోయి భీమన్న స్మారక జాతీయ పురస్కారాలను తిరుపతి జిల్లా బాకరాపేటలో ఆదివారం అందజేసింది. డాక్టర్ ఎం ప్రసాద్ తెలుగు సాహిత్యంలో చేసిన విశిష్ట సేవకు గుర్తింపుగా ఉషోదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు దనాసి ఉషారాణి జాతీయ పురస్కారం అందజేశారు.

అపస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిల్



ప్రమాణ స్వీకారం చేస్తున్న అనిల్

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నెల్లూరులో నిర్వహించారు. ఆత్మకూరుకు చెందిన ఉపాధ్యాయుడు పట్నం అనిల్‌కుమార్‌ను జిల్లా అపస్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనిల్ మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సహచర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. అపస్ అండతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఘనంగా ఔలియా గంధమహోత్సవం

సోమశిల: మండలం సోమశిలలోని దర్గా వద్ద మస్తాన్‌వలి ఔలియా 31వ గంధమహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు, ఒంటెపై గంధాన్ని ఊరేగించారు. భక్తులకు గంధాన్ని పంచి పెట్టారు.

వైభవంగా శరన్నవ రాత్రి మహోత్సవాలు



ఆత్మకూరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో భువనేశ్వరి అలంకరణ

దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు పలు ఆలయాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఆత్మకూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో తొలి రోజు 108 మంది ముత్తైదువులు కాశీనాయన ఆశ్రమ పాఠశాల నుంచి కలిశాలను మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరాలయంలో కలిశ స్థాపన చేసి లలితా సహస్ర నామ పారాయణంతో మహిళలతో సామూహికంగా కుంకుమ పూజ చేయించారు. అమ్మవారు బాలాత్రిపురసుందరి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు.



ఆత్మకూరు: కలశాలను చేతబట్టి కన్యకాపరమేశ్వరి ఆలయానికి సాగుతున్న మహిళలు



సంగం: సంగమేశ్వరస్వామి, గంగమ్మ ఆలయంలోకి కలిశాలతో పవిత్ర జలాలు తీసుకెళ్తున్న భక్తులు



సంగమేశ్వరాలయంలో కామాక్షిదేవి అలంకారంలో అమ్మవారు



మహిమలూరు పోలేరమ్మ గుడిలో విశేష పూజలు నిర్వహిస్తున్న మహిళలు



డీసీపల్లి గంగమ్మ దేవాలయంలో దేవీ నవరాత్రులు ప్రారంభం పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సోమశిల: కామిరెడ్డిపాడు దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో దుర్గమ్మకు విశేష పూజలు



కలిగిరి: తెల్లపాడులో బాల త్రిపుర సుందరిదేవిగా భద్రకాళి



దుత్తలూరు: బాలత్రిపుర సుందరిదేవిగా ఎల్లమ్మతల్లి



వరికుంటపాడు: శైలపుత్రిగా మానసాదేవి అమ్మవారు

పచ్చ నేతల దాష్టీకం

- ఇంటి స్థలం విషయమై ఆడ పిల్లలతో అసభ్యకర ప్రవర్తన
- ఎదురు తిరగడంతో కొట్టి ముళ్లల్లోకి తోసేసిన వైనం
- అక్కా చెల్లెళ్లను రేప్ చేసి హత్య చేస్తామంటూ హెచ్చరిక
- పోలీసులను ఆశ్రయించిన బాధిత యువతులు

కావలి: పట్టణంలో కొందరు టీడీపీ నేతలుగా చెలామణి అవుతూ రౌడీయిజంతో దందాలను కొనసాగిస్తున్నారు. ఇంటి స్థలం విషయమై టీడీపీ నేతల ముసుగులో ఆడ పిల్లలపై రౌడీయిజానికి తెగబడ్డారు. ఆ స్థలం వ్యవహారంపై కోర్టులో కేసు కొనసాగుతోంది. ఈ దశలో రౌడీమూకలు ఇద్దరు ఆడపిల్లలను బెదిరించగా ఎదురుతిరగడంతో వారితో అసభ్యకరంగా ప్రవర్తించారు. కొట్టి పక్కనే ఉన్న ముళ్ల చెట్లలోకి తోసేశారు. ఇష్టారీతిన ప్రవర్తిస్తే రేప్ చేసి, హత్య చేస్తామంటూ సైగలతో హెచ్చరించారు. చుట్టూ జనం చూస్తున్నప్పటికీ ఎవరూ టీడీపీ రౌడీ మూకలను అడ్డుకోలేకపోయారు. దీంతో బాధిత యువతులు పోలీసులను ఆశ్రయించారు. బాధిత యువతులు, పోలీసుల సమాచారం మేరకు.. కావలి పట్టణంలోని 15వ వార్డు పరిధి ముసునూరులో ఒక ఇంటి స్థలం విషయంలో మోటుపల్లి రమ్యకు, ఆమె అక్కా చెల్లెళ్లు అయిన సాధినేని ప్రియాంక, చందన మధ్య వివాదం ఉంది. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉంది. మోటుపల్లి రమ్యకు ఇటీవల ప్రకాశం జిల్లాకు చెందిన పొన్నగంటి అనిల్‌కుమార్‌తో వివాహం అయింది. వివాదంలో ఉన్న స్థలం విషయంలో తనకు అనుకూలంగా వ్యవహారం చక్కబెట్టాలని స్థానిక టీడీపీ నాయకుడు బొట్లగుంట శ్రీహరినాయడు, చిట్టాబత్తిన మాల్యాద్రి అలియాస్ ఎర్ర మాలితో డీల్ కుదుర్చుకుంది. ప్రియాంక, చందన హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. శనివారం వారు ముసునూరులోని ఇంటికి వచ్చారు. దీంతో చిట్టాబత్తిన మాల్యాద్రి, పొన్నగంటి అనిల్‌కుమార్ స్థలం వివాదాన్ని ప్రస్తావించి పత్రికల్లో రాయడానికి సాధ్యపడని నీఛమైన భాషతో అక్కా చెల్లెళ్లను బెదిరించారు. వీరి దౌర్జన్యాన్ని ఒక యువతి తన సెల్ ఫోన్‌లో వీడియో తీయడంతో ఆ ఫోన్‌ను కూడా లాగేసుకున్నారు. అతిగా ప్రవర్తిస్తే రేప్ చేస్తామంటూ చేతి సైగలతో జుగుప్సాకరంగా ప్రవర్తించారు. చంపిపడేస్తాం.. ఎవరూ ఏమీ చేయలేరంటూ బెదిరించారు. మా వెనుక మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన కన్నా పెద్ద హోదాలో ఉన్న టీడీపీ నేతలు ఉన్నారని, మాపై పోలీసు కేసు పెట్టుకున్నా ఎవరూ ఏమీ చేయలేరంటూ అహంకారాన్ని ప్రదర్శించారు. అక్కా చెల్లెళ్లు కన్నీరుమున్నీరుగా కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు ప్రాణ హాని ఉందని, తమ ఫోన్‌లో రికార్డు అయిన వీడియోలను పరిశీలిస్తే వారు చేసిన దాష్టీకం తెలుస్తుందని వాపోయారు. తమకు న్యాయం చేయాలని అక్కా చెల్లెల్లు పోలీసులకు మొరపెట్టుకున్నారు. ఇదిలా ఉండగా టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు, బొట్లగుంట శ్రీహరి నాయుడు ఆ యువతులను కేసును వెనక్కు తీసుకోవాలని, మన పార్టీ వారిపైనే ఫిర్యాదులు చేస్తే ఎలా అంటూ అక్కా చెల్లెళ్లపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కావలి రూరల్ ఎస్సై శెట్టిపల్లి సుమన్ మాట్లాడుతూ యువతుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, బీజేపీ నేతలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: అల్లూరు మండలానికి చెందిన పలువురు టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అల్లూరు చెలిక సంఘంకు చెందిన 15 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకుడు దాసరి పోలయ్య ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. వారందరినీ ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి పరిచయం చేసుకుని కాసేపు ముచ్చటించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి రాగద్వేషాలకు అతీతంగా అందరికీ ప్రాధాన్యత ఇస్తుండడంతో ఎమ్మెల్యే నాయకత్వంలో వైఎస్సార్‌సీపీలో పని చేసేందుకు పార్టీలో చేరుతున్నామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కావలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కుటుంబంలో అందరం కలిసి సమష్టిగా నిర్ణయాలు తీసుకుని అందరి మనోభావాల మేరకు అందరికీ సమన్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నీలం సాయికుమార్, మేడా శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ

కావలి: పట్టణంలోని డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం 60 మంది నిరుపేద వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేశారు. న్యాయవాది ఎం.బాబూరావు మాట్లాడుతూ డీఆర్ లక్షలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని, విద్యాదాత డీఆర్ పేరు మీద పేద వృద్ధులను ఆదుకుంటున్న ఆయన కుమారులు వినయ్‌కుమార్‌రెడ్డి, విద్యాధర్ కుమార్‌రెడ్డిలకు అభినందనలు తెలిపారు. సేవలో విద్యార్థులను భాగస్వాములను చేయడంతో వారిలో కూడా సామాజిక సహా, సేవాభావం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ వినయకుమార్‌రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, విష్ణు, సతీష్‌సింగ్, రంగనాయకులు పాల్గొన్నారు.



మంచినీటి బోరు ఏర్పాటు

సంగం: మండలంలోని వంగల్లు వడ్డిపాళెం, ముస్లిం కాలనీ ప్రజలు తాగునీటి పరిష్కారానికి ఆదివారం మంచినీటి బోరును ఏర్పాటు చేశారు. స్థానికులు తాగునీటికి పడుతున్న ఇబ్బందులపై వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పులగంశంకర్‌రెడ్డి, మరో నేత కంటాబత్తిన రఘునాథరెడ్డి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వివరించారు. వంగల్లు గ్రామ సర్పంచ్ రామయ్య, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఆత్మకూరు ఎమ్మెల్యే కార్యాలయంలో అబ్దుల్ కలాం నివాళులర్పిస్తున్న దృశ్యం

కావలి: శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 92వ జయంతి సందర్భంగా పట్టణంలోని జెండాచెట్టు సెంటర్‌లో ఉన్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం వద్ద ఆదివారం జయంతిని ఘనంగా నిర్వహించారు. కలాం విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని కొనియాడారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన గొప్ప దేశభక్తుడన్నారు. రాష్ట్రపతిగా, రచయితగా, శాస్త్రవేత్తగా ఆధ్యాపకుడిగా దేశానికి విశిష్ట సేవలందించారు. యావత్తు ప్రపంచం మెచ్చిన మహోన్నత వక్తి అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, డేగా రాము యాదవ్, ఈతముక్కల బాలమురళీరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కలాం ఆశయాలు అనుసరణీయం

ఆత్మకూరు: శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా దేశానికి విశేష సేవలు అందించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యువత ఉజ్వల భవిష్యత్‌కు అనేక సూచనలు చేశారని అవి అనుసరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో ఆదివారం డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, పలువురు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కౌన్సిలర్లు చెరుకూరి కామాక్షయ్య నాయుడు, శివకోటారెడ్డి, పార్టీ నాయకులు కొప్పోలు చిన్నపరెడ్డి, సయ్యద్ జమీర్, కొండా చిన్న వెంకటేశ్వర్లు, మునీర్ పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద జయంతి వేడుకల్లో పాల్గొన్న చుంచులూరు గ్రామస్తులు

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ఖ్యాతి ఘడించిన దివంగత మాజీ రాష్ట్రపతి జయంతి వేడుకలు ఆదివారం మండలంలోని చుంచులూరులో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన షేక్ ఖాజావలి ఆధ్వర్యంలోఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మర్రిపాడు ఎంఆర్‌పీ కలిశెట్టి రాజేంద్రకుమార్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం జీవితం నేటి యువతతో పాటు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. స్థానికులు మల్లికార్జునరెడ్డి, చరణ్‌తేజ, ఖాదర్‌బాషా, వనం నరసింహులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

18న మర్రిపాడులో జగనన్నకు చెబుదాం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడులో ఈ నెల 18న జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దారు ఆనందరావు ఆదివారం తెలిపారు. కలెక్టర్ హరినారయణన్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో అధికారులకు విజ్ఞప్తులు చేయొచ్చునని తెలిపారు.

దూదేకుల సంక్షేమ అధ్యక్షుడిగా ఖాదర్‌బాషా



దుత్తలూరు: మండలంలోని కమ్మవారిపాళెంలో నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దూదేకుల ఐకృత కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌బాబు అధ్యక్షతన ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షుడిగా షేక్ ఖాదర్‌బాషాను నియమించారు. దూదేకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్‌బీ, జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్‌లో కావలి ఉపాధ్యాయులకు పదవులు



మునీర్ జాన్



రాజ్ కుమార్

కావలి: నెల్లూరు జిల్లా వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా కావలికి చెందిన మునీర్‌జాన్‌ను జిల్లా కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేయడంతో పలువురు అభినందించారు. నెల్లూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కే రాజ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఉదయగిరి: మండలంలోని కొండాయపాళెం పంచాయతీ మాసాయిపేట బీసీ కాలనీలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గానుగపెంట ఓబుల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అధికారులు హాజరుకావాలన్నారు.

పోలేరమ్మ చెట్టు వద్ద ప్రత్యేక పూజలు

అల్లూరు: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పోలేరమ్మ చెట్టు వద్ద మంగళవాయిద్యాలు, విద్యుదీపాలంకరణతో పూలతో అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నవరాత్రులు అమ్మవారికి వివిధ రకాల అలంకరణలతో ప్రత్యేక పూజలను నిర్వహించడం ఆనవాయితీ.



నాగార్పమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

చేజర్ల: మండలంలోని గొల్లపల్లిలో నాగార్పమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం పాలాభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రతిష్ట, ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు.

పోలేరమ్మ తిరునాళ్లలో మేకపాటి

కొండాపురం: మండలంలోని సత్యవోలు పంచాయతీ అగ్రహారంలో ఇటీవల నూతనంగా నిర్మించిన గ్రామదేవత పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. రాజగోపాల్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిమ్మిలి రవీంద్ర, గుడవల్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులరెడ్డి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు పరుచూరి మాల్యాద్రి, లెక్కల వెంకట రమణయ్య, నాయకులు ఎం.వెంగయ్య, మన్నం వెంకట సుబ్బయ్య, ఎడ్లపల్లి వెంకటరమయ్య పాల్గొన్నారు.



నాయకులతో ఉన్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

పోలేరమ్మ తల్లికి పొంగళ్లు

జలదంకి: మండలంలోని జమ్మలపాళెం పోలేరమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు పెట్టారు. అమ్మవారిని పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. ముందుగా పెద్ద కాపు, పెద్ద గొల్లల ఆధ్వర్యంలో అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.



పూజలు చేస్తున్న భక్తులు

ప్రభుత్వ స్థలం దర్జాగా ఆక్రమణ

- చోద్యం చూస్తున్న అధికారులు



ఆత్మకూరు ముంబయి రహదారి పక్కనే దర్జాగా ప్రభుత్వ స్థలం ఆక్రమించి చదును చేసిన దృశ్యం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణదారులు దర్జాగా ఆక్రమించుకుని చదును చేస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరు–ముంబయి రహదారిపై నెల్లూరుపాళెం సమీపంలో రోడ్డు పక్కనే ఓ మెకానిక్ షెడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతి పొంది షెడ్డు నిర్మించుకున్నాడు. అంతటితో ఆగకుండా గత వారం రోజుల వ్యవధిలో సుమారు 100 అంకణాలకుపైగా ఆక్రమణ చేసి మట్టి తోలి చదును చేశాడు. అతనికి మంజూరు చేసిన స్థలానికి మూడు రెట్లు అదనపు స్థలం ఆక్రమించి చదును చేస్తున్నా సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు. సమీపంలోని వాగు ఉండడంతో అక్కడి నుంచి మట్టిని తరలించి చదును చేయడం విశేషం. ఈ విషయమై అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు. మూడు దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వం చేనేతలకు అందజేసిన నివేశన స్థలాల్లో పలువురు ఇళ్లు నిర్మించుకోగా, మిగిలిన స్థలాల్లో ఆ ప్రాంతంలో విలువ పెరగడంతో ఆక్రమణకు గురవుతున్నాయి. దీని విషయమై అధికారులకు పలువురు అర్జీలు అందజేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆక్రమణలను పరిశీలించి అరికట్టాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ స్థలాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.